మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 171 | గురువారం | 18 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



3లో..




## ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం



- ☐ 17.11 శాతం వృద్ధి సాధనపై అధికారులకు దిశానిర్దేశం
- ☐ వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో సమాన ప్రగతి అవసరం
- ☐ 2047 విజన్‌తో రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి ప్రగతి పథంలో నడిపించి, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై లోతైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను అధికారుల ముందుంచిన సీఎం, గడచిన రెండు త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని పేర్కొంటూ, ఈసారి 17.11 శాతం వృద్ధి లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో సాధించిన త్రైమాసిక ఫలితాలను పరీక్షలు రాసిన విద్యార్థిలా ఆసక్తిగా ఎదురుచూస్తానని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అధికారులు కూడా అదే స్థాయి బాధ్యతతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మొత్తం 17 కీలక రంగాల్లో సమానంగా పురోగతి సాధిస్తేనే రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు. పశుసంపద, తయారీ రంగం, మత్స్య పరిశ్రమ సహా ప్రతి రంగంలో సమగ్ర అభివృద్ధి అవసరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానాల కారణంగా రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు తెలంగాణతో పోటాపోటీగా ఉన్న ఆంధ్రప్రదేశ్, గత పాలన వల్ల దక్షిణాది రాష్ట్రాల్లోనే

2 లో..



## కాశ్మీర్ లోయకు ట్యాంకులు,
# ఆర్టిలరీ గన్స్ తరలింపు

- సైనిక ప్రత్యేక రైలు ద్వారా కీలక లాజిస్టిక్స్ మైలురాయి
- జమ్మూ నుంచి అనంతనాగ్ వరకు విజయవంతమైన తరలింపు
- ఉధంపూర్ శ్రీనగర్  బారాముల్లా రైల్వే లింక్ కీలక పాత్ర

మన గళం, న్యూఢిల్లీ : దేశ ఉత్తర సరిహద్దుల వెంట సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత సైన్యం కీలక ముందడుగు వేసింది. డిసెంబర్ 16, 2025న కాశ్మీర్ లోయకు ట్యాంకులు, ఆర్టిలరీ గన్స్‌ను సైనిక ప్రత్యేక రైలు ద్వారా తరలిస్తూ భారత సైన్యం ఒక ప్రధాన లాజిస్టిక్స్ మైలురాయిని సాధించింది. ఈ చర్యతో సైన్యం వేగవంతమైన కదలికలు, సరఫరా సామర్థ్యాల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు తెలిపారు. వాలిడేషన్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా జమ్మూ

2 లో..



## షర్మిలకు వెల్లువెత్తిన
# శుభాకాంక్షలు

- చంద్రబాబు, పవన్ కల్యాణ్ నుంచి జన్మదిన సందేశాలు
- రాజకీయాలకు అతీతంగా అభినందనలు
- బహిరంగంగా స్పందించని జగన్

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈరోజు తన 51వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమెకు రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ వర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న

2 లో..

## మహిళా క్రికెటర్ శ్రీచరణికి
# రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం

- వన్డే ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శనకు ప్రభుత్వ గౌరవం
- ఉండవల్లి నివాసంలో నగదు ప్రోత్సాహకాన్ని అందజేత
- మహిళా క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

ఉండవల్లి, మన గళం :మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసి రాష్ట్రానికి గర్వకారణమైన మహిళా క్రికెటర్ శ్రీచరణికి కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ. 2.5 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి నారా లోకేష్ అందజేశారు. ఉండవల్లిలోని నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీచరణిని సత్కరించి, ఆమె సాధించిన విజయాన్ని ప్రభుత్వం తరపున అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర ప్రతిభను చాటిన శ్రీచరణి ప్రదర్శన యువతకు, ముఖ్యంగా బాలికలకు గొప్ప స్ఫూర్తి అని అన్నారు. కఠిన సాధన, పట్టుదల, అంకితభావంతో ప్రపంచ కప్‌లో మెరిసిన ఆమె




ప్రయాణం ప్రశంసనీయమని పేర్కొన్నారు. క్రీడారంగంలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తూ అండగా నిలుస్తుందని స్పష్టం

2 లో..

## భారత సైన్యంలో చేరిన కొత్త
# అపాచీ హెలికాప్టర్లు




- భారత్-అమెరికా రక్షణ భాగస్వామ్యంలో మరో కీలక ముందడుగు
- ప్రాంతీయ భద్రత బలోపేతానికి అపాచీ శక్తి
- సహ ఉత్పత్తి, శిక్షణ, సాంకేతిక సహకారం మరింత విస్తరణ

మన గళం, న్యూఢిల్లీ : భారత సైన్యానికి అత్యాధునిక బోయింగ్ ఇండియా ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లు చేరడం భారత్-అమెరికా మధ్య పెరుగుతున్న రక్షణ భాగస్వామ్యంలో మరో కీలక మైలురాయిగా నిలిచిందని భారతదేశంలోని అమెరికా దౌత్య కార్యాలయం వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు, భారత ప్రధాని సంయుక్త ప్రకటనలో ఇచ్చిన హామీల మేరకు ఈ హెలికాప్టర్లు భారత సైన్యంలోకి రావడం జరిగిందని పేర్కొంది.

2 లో..

## టీటీడీకి ఏడాదికి సరిపడా సిల్వర్
# మాక్స్ హాఫ్ బ్లేడ్ల విరాళం

- రూ. 1.20 కోట్ల విలువైన బ్లేడ్లు అందజేసిన వర్టిస్ గ్లోబల్ డైరెక్టర్ శ్రీధర్ బోడుపల్లి



మన గళం, తిరుమల : హైదరాబాద్‌కు చెందిన వర్టిస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ శ్రీధర్ బోడుపల్లి టీటీడీకి ఏడాదికి సరిపడా రూ. 1.20 కోట్ల విలువైన సిల్వర్ మాక్స్ హాఫ్ బ్లేడ్లను విరాళంగా అందజేశారు. బుధవారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడుకు ఈ బ్లేడ్లను

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో
# హృదయాన్ని తాకిన దృశ్యం

- ఓటు హక్కు కోసం కానిస్టేబుల్ మానవీయత



మన గళం, చెన్నారావుపేట : చెన్నారావుపేట మండలం భోచెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా హృదయాన్ని తాకే దృశ్యం ఒకటి చోటుచేసుకుంది. వృద్ధాప్యంతో నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధ మహిళకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ మానవీయత ప్రదర్శించారు.పోలింగ్ కేంద్రానికి చేరుకోవడంలో ఇబ్బంది పడుతున్న వృద్ధ మహిళను గమనించిన జయరాజ్, ఆమెను తన చేతుల్లో

2 లో..

## ఉపాధ్యాయులు ఇథియోపియా
# భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు



- భారత్‌లో విద్యాభ్యాసం చేసి దేశ నిర్మాణకర్తలుగా తిరిగివచ్చిన ఇథియోపియా విద్యార్థులు : ప్రధాని మోదీ

మన గళం డెస్క్ : ఇథియోపియా ప్రజల జీవితాల్లో భారత ఉపాధ్యాయుల పాత్ర మరచిపోలేనిదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇథియోపియా పార్లమెంట్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో, అనేక మంది ఇథియోపియా తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దిన

2 లో..

# కాశ్మీర్ లోయకు ట్యాంకులు, ఆర్టిలరీ గన్స్ తరలింపు



ప్రాంతం నుంచి కాశ్మీర్ లోయలోని అనంతనాగ్ వరకు ట్యాంకులు, ఆర్టిలరీ గన్స్, డోజర్లు విజయవంతంగా తరలించారు. కఠిన భౌగోళిక పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ తరలింపు సజావుగా పూర్తవడం ద్వారా భారత సైన్యం యొక్క లాజిస్టిక్స్ ప్రణాళికా సామర్థ్యం, కార్యాచరణ సిద్ధత స్పష్టంగా వెల్లడైందని పేర్కొన్నారు.

ఈ విజయానికి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖతో సన్నిహిత సమన్వయం కీలకంగా నిలిచింది. ముఖ్యంగా ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్ట్ అమల్లోకి రావడంతో, ఉత్తర సరిహద్దుల వెంట వేగంగా సైనిక సరఫరాలు చేరవేయడం సాధ్యమైందని అధికారులు వివరించారు. ఈ రైల్వే లింక్ వల్ల దూర ప్రాంతాల్లోనూ భారీ సైనిక పరికరాలను త్వరగా తరలించే సామర్థ్యం ఏర్పడింది. ఉత్తర సరిహద్దుల వద్ద ఆపరేషనల్ రెడినెస్‌ను మరింత బలోపేతం చేయడంలో ఈ పరిణామం కీలకంగా మారిందని రక్షణ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఆధునిక మౌలిక వసతులు, రవాణా నెట్వర్క్‌లతో భారత సైన్యం సరిహద్దు భద్రతను మరింత సమర్థవంతంగా నిర్వహించే స్థాయికి చేరుతోందని, ఈ లాజిస్టిక్స్ విజయం భవిష్యత్ రక్షణ సన్నద్ధతకు బలమైన పునాదిగా నిలుస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

వెనుకబడిందని చెప్పారు. ఈ పరిస్థితిని మార్చి, రాష్ట్రాన్ని తిరిగి వేగంగా ముందుకు నడిపించి అగ్రస్థానానికి చేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 2024 తర్వాత జీఎస్‌డీపీలో కొంత మెరుగుదల కనిపిస్తోందని, దీన్ని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. వ్యవసాయం ఎప్పుడూ డిమాండ్ ఆధారితంగా ఉండాలని, మార్కెటింగ్ ఇంటెలిజెన్స్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యాన రంగంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని, ఈ రంగంలో రూ. 60 నుంచి 70 వేల కోట్ల వరకు ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పంటల ప్రణాళికలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలు రూపొందించి, డిమాండ్ ఆధారిత పంటలు, నీటి భద్రత, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్ వంటి అంశాలను అనుసంధానించాలని సూచించారు. అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలను 'పూర్వోదయ' భావన కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపాలంటే ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రయాణంలో ఎవరు వెనుకబడ్డా లక్ష్యాలను చేరుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు. గేట్స్ ఫౌండేషన్, అగ్రివాచ్ వంటి సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి భూ కేటాయింపులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాయని చెప్పారు.



# షర్మిలకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు

నేతగా షర్మిలకు పలువురు ప్రముఖులు జన్మదిన అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా ఆమెకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. రాజకీయ భిన్నత్వాలకు అతీతంగా ఆయన ఇచ్చిన శుభాకాంక్షలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అలాగే ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా వైఎస్ షర్మిలకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆమెకు చిరాయువు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ సందేశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే షర్మిల సోదరుడు, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మాత్రం ఆమెకు బహిరంగంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయలేదు. అన్నాచెల్లెళ్ల మధ్య కొనసాగుతున్న రాజకీయ విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం మరోసారి వారి మధ్య ఉన్న దూరాన్ని స్పష్టంగా చూపుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర చర్చకు దారి తీసింది.

# భారత సైన్యంలో చేరిన కొత్త అపాచీ హెలికాప్టర్లు

ఈ సందర్భంగా అమెరికా దౌత్య కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, అపాచీ హెలికాప్టర్ల రాకతో భారత్–అమెరికా ప్రధాన రక్షణ భాగస్వామ్యం మరింత బలపడిందని తెలిపింది. ఇది రెండు దేశాల మధ్య విశ్వసనీయతతో కూడిన, నిరంతరం విస్తరిస్తున్న రక్షణ సహకారానికి నిదర్శనమని పేర్కొంది. అమెరికా రక్షణ శాఖ, భారత రక్షణ మంత్రిత్వ శాఖ మధ్య కుదిరిన ఒప్పందాలకు ఇది స్పష్టమైన అమలుగా అభివర్ణించింది. అత్యాధునిక సాంకేతిక సామర్థ్యాలతో రూపొందించిన అపాచీ హెలికాప్టర్లు భారత సైన్యానికి గణనీయమైన బలాన్ని చేకూరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. దాడి సామర్థ్యం, నిఘా, యుద్ధ సహాయక చర్యల్లో అపాచీ కీలక పాత్ర పోషిస్తుందని, దీంతో ప్రాంతీయ భద్రతపై భారత్, అమెరికా ఉమ్మడి దృష్టి మరింత బలోపేతమవుతుందని అమెరికా దౌత్య కార్యాలయం పేర్కొంది. అపాచీ హెలికాప్టర్ల చేరికతో సహ ఉత్పత్తి, శిక్షణ, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి వంటి రంగాల్లో భారత్–అమెరికా మధ్య సహకారం మరింత లోతుగా కొనసాగుతుందని తెలిపింది. రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ పరిణామం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# మహిళా క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం

చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు. వారు శ్రీచరణిని అభినందిస్తూ, మహిళా క్రీడాకారులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలకు దారి తీస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళల క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతిభను గుర్తించి గౌరవించడం ద్వారా రాష్ట్రంలో క్రీడా సంస్కృతి మరింత బలోపేతం అవుతుందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శ్రీచరణి సాధించిన విజయాలు రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని, రాష్ట్రం నుంచి మరిన్ని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు.

# టీటీడీకి ఏడాదికి సరిపడా సిల్వర్ మాక్స్ హాఫ్ బ్లేడ్ల విరాళం

అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ, భక్తులు తలనీలాలు సమర్పించేందుకు ఉపయోగించే హాఫ్ బ్లేడ్ల కోసం టీటీడీ ప్రతి ఏడాది సుమారు రూ. 1.16 కోట్ల వరకు ఖర్చు చేస్తోందని తెలిపారు. రోజుకు సగటున 40 వేల హాఫ్ బ్లేడ్లను కల్యాణకట్టల్లో వినియోగిస్తున్నామని వివరించారు. ఒక ఏడాదికి సరిపడా బ్లేడ్లను విరాళంగా అందించేందుకు ముందుకు రావడం నిజంగా అభినందనీయమని దాత శ్రీధర్ బోడుపల్లిని చైర్మన్ ప్రశంసించారు. దాత శ్రీధర్ బోడుపల్లి మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రపంచంలోనే తొలిసారిగా హాఫ్ బ్లేడ్లను అందుబాటులోకి తీసుకువచ్చిన సంస్థ తమదేనని తెలిపారు. తమ సంస్థ తయారు చేసిన బ్లేడ్లకు యూరప్, అమెరికాతో పాటు మొత్తం 52 దేశాల్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. అంతేకాక 7 ఓ క్లాక్ బ్రాండ్ బ్లేడ్లను కూడా తమ సంస్థే ఉత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యం, సేవాభావనతో ఈ విరాళాన్ని అందించడం సంతోషంగా ఉందని శ్రీధర్ బోడుపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణకట్ట ఏఈవో రమాకాంత్ పాల్గొన్నారు. భక్తుల తలనీలాల సమర్పణ ప్రక్రియ మరింత సజావుగా సాగేందుకు ఈ విరాళం ఉపయోగపడనుందని టీటీడీ అధికారులు తెలిపారు.




## ఉపాధ్యాయులు ఇథియోపియా

# భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు



భారత ఉపాధ్యాయుల గురించి ఎంతో ఆత్మీయంగా మాట్లాడతారని ఆయన గుర్తు చేశారు. విద్య ద్వారా రెండు దేశాల మధ్య ఏర్పడిన మానవ బంధాలు కాలానికి అతీతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఒకప్పుడు భారత ఉపాధ్యాయులు ఇథియోపియాకు వచ్చి అక్కడి విద్యా వ్యవస్థకు సేవలందించారని, అదే స్ఫూర్తితో ఇప్పుడు ఇథియోపియా విద్యార్థులు జ్ఞానం, స్నేహం కోసం భారత్‌కు వస్తున్నారని ప్రధాని చెప్పారు. భారత్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తర్వాత వారు తిరిగి స్వదేశానికి వెళ్లి ఆధునిక ఇథియోపియాను నిర్మించే నిర్మాతలుగా మారుతున్నారని ప్రశంసించారు. ఇది కేవలం విద్యా మార్పిడి మాత్రమే కాకుండా, రెండు దేశాల మధ్య గాఢమైన విశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. భారత్‌లో చదువుకున్న అనేక మంది ఇథియోపియా విద్యార్థులు నేడు దేశ పరిపాలన, ప్రజాసేవ, విధాన రూపకల్పనలో కీలక స్థానాల్లో ఉన్నారని ప్రధాని తెలిపారు. వారిలో కొందరు ఇథియోపియా పార్లమెంట్ సభ్యులుగా, కీలక బాధ్యతల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఈ పార్లమెంట్‌లోనే స్పీకర్ కూడా భారత్‌తో ఉన్న ఈ విద్యా అనుబంధానికి సాక్ష్యంగా ఉన్నారని మోదీ అన్నారు. జ్ఞానం, స్నేహం, పరస్పర గౌరవమే భారత్‌ఇథియోపియా సంబంధాలకు బలమైన పునాదిగా మారాయని ప్రధాని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా ఏర్పడిన ఈ మానవ సంబంధాలు రాజకీయాలు, ఆర్థిక ఒప్పందాలకు మించిన శాశ్వత బంధాలని, భవిష్యత్తులోనూ రెండు దేశాల మధ్య సహకారం మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హృదయాన్ని తాకిన దృశ్యం



ఎత్తుకుని పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లారు. ఎన్నికల భద్రత బాధ్యతలతో పాటు మానవత్వాన్ని చాటిన ఈ ఘటన అక్కడున్న వారిని కదిలించింది. వృద్ధ మహిళ ఓటు వేసిన అనంతరం ఆయన తిరిగి సురక్షితంగా ఆమెను ఇంటివద్దకు చేర్చారు. ఈ ఘటన గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటోంది. ఎన్నికల విధులు నిర్వర్తించడమే కాకుండా, ప్రజాస్వామ్య హక్కుల పట్ల బాధ్యతతో వ్యవహరించిన జయరాజ్‌ను స్థానికులు అభినందిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత బలపరుస్తాయని వారు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటు విలువైనదని, అవసరమైన చోట మానవీయతతో స్పందించాల్సిన బాధ్యత అధికారులదేనని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ చేసిన ఈ సేవ గ్రామంలో ఆదర్శంగా నిలిచింది.

# సిర్పూర్‌లో మావోయిస్టుల అరెస్టులపై తీవ్ర విమర్శలు

మన గళం, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ ప్రాంతంలో 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడంపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ అరెస్టులను ఖండిస్తూ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఒక లేఖను విడుదల చేసింది. కకర్ బుడ్డి, బాబ్జీ పేట్ గ్రామాల సమీపంలో నిరాయుధంగా ఉన్న తమ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని లేఖలో ఆరోపించింది. ఈ చర్య తెలంగాణలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య వాతావరణానికి తీవ్ర ఎదురుదెబ్బగా అభివర్ణించింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూపొందించిన 'కగార్' యుద్ధానికి మద్దతు ఇవ్వకూడదని మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం 'మావోయిస్టు ముక్త్', 'ప్రతిపక్ష ముక్త్' లక్ష్యాలతో ఈ యుద్ధాన్ని అమలు చేస్తోందని ఆరోపించింది. ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైన చర్యల శ్రేణిలో భాగమని లేఖలో పేర్కొంది. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, ఏక్ చునావ్, ఏక్ పార్టీ' వంటి నినాదాల ద్వారా దేశంలోని ఇతర రాజకీయ పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఎన్నికల కమిషన్, కోర్టులు, సీబీఐ, ఎన్ఐఏ వంటి రాజ్యాంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని విమర్శించింది. దీనికి బీహార్ ఎన్నికలే తాజా ఉదాహరణగా పేర్కొంది.

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

**– ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలి – జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : డిసెంబర్ 21వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా సమన్వయంతో, సమర్థవంతంగా అమలు చేసి, వంద శాతం శిశువులకు పోలియో చుక్కలు వేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అధికారులతో కలిసి జేసీ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 21వ తేదీన జిల్లాలో మొత్తం 3 లక్షల 52 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి జిల్లావ్యాప్తంగా మొత్తం 1,600 పోలియో బూత్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1,180 బూత్ లు, పట్టణ ప్రాంతాల్లో 420 బూత్ లు, 52 ట్రాన్సిట్ పాయింట్లు, 63 మొబైల్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అలాగే డిసెంబర్ 22, 23 తేదీలలో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడానికి 5 లక్షల 14 వేల ఇళ్లను లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఐసిడిఎస్, మున్సిపల్, పంచాయితీ రాజ్, రెవెన్యూ, విద్యా శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ఒక్క చిన్నారి కూడా మిస్ కాకూడదన్నారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి పోలియో చుక్కల పంపిణీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు, మైక్ ప్రచారం, మీడియా ద్వారా సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, డీఎంహెచ్వో డాక్టర్ ఎం భాస్కర్, డీ.ఐ.ఓ డాక్టర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**– బాధిత కుటుంబాలకు పరిహారం త్వరితగతిన మంజూరు చేయాలి – జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు కు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధిత కుటుంబాలకు ఉపాధి, ఇంటి స్థలం, అర్హత కలిగిన ఇతర ప్రయోజనాలను త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ తదితరులపై అత్యాచారాలు జరగకూడదని, అలాంటివి జరిగితే చట్ట ప్రకారం కేసులు బుక్ చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల ఖచ్చితంగా సివిల్ రైట్ డే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్డీఓ లను జేసీ ఆదేశించారు. డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ 2013 నుండి 2025 వరకు పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను పోలీసు అధికారులతో సమీక్షించారు. చాలా రోజుల నుంచి పెండింగ్ లో ఉన్న కేసులను కూడా త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధిత కుటుంబాలకు ఉద్యోగాలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న వారికి త్వరితగతిన నియామకాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో పెండింగ్ లో ఉన్న 152 మంది బాధితులకు ఎఫ్ఐఆర్, ఛార్జ్ షీట్ లో రావాల్సిన మానిటరీ రిలీఫ్ కు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిక అధికారి బి.రాధిక అక్టోబర్ 3, 2025 తేదీన జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో డివిఎంసి సభ్యులు ప్రస్తావించిన అంశాల పై అధికారులు తీసుకున్న చర్యల గురించి వివరించారు. డివిఎంసీ మెంబర్ సురేంద్ర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బాలికల హాస్టల్ లలో ప్రభుత్వం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి స్టేషన్ లో ఎస్సీ,ఎస్టీ లకు సంబంధించి బుక్ అయ్యే కేసుల వివరాలను సభ్యులకు అందజేయాలని కోరారు. డివిఎంసీ మెంబర్ మాలతి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ భవన మరమ్మతులకు ఎంపీ కేటాయించిన నిధులను వినియోగించుకుని భవన మరమ్మతుల పనులు చేయాలని కోరారు. డివిఎంసీ మెంబర్ వెంకట నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న వితంతువు పెన్షన్ లను శాంక్షన్ చేయించాలని కోరారు. సమావేశంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, డివిఎంసి సభ్యులు సురేంద్ర, సురేష్, వెంకట నాగరాజు యాదవ్, మాలతి , మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహాసభల జయప్రదానికి ప్రతి కార్మికుడు కృషి చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : విశాఖపట్నంలో ఈనెల 31వ తేదీ నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు జరుగు అఖిలభారత సీఐటీయూ 18వ మహాసభలను విజయవంతానికి ప్రతి కార్మికుడు కృషి చేయాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు చెన్నయ్య అధ్యక్షతన కార్మిక కర్షక భవన్ నందు కర్నూలు మండల కమిటీ సమావేశంజరిగింది. ఈ సందదర్భంగా ఎండి అంజిబాబు, జిల్లా కోశాధికారి యం గోపాల్ మాట్లాడారు. దేశంలో ఎప్పుడూ లేనంత దుర్భర పరిస్థితిని కార్మికులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 130 సంవత్సరాల క్రితం సాధించుకున్న హక్కులు కూడా కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తుందని తెలిపారు. మహాసభల్లో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పైన చర్చించడం జరుగుతుందన్నారు. సభలో చేసిన తీర్మానాలు అమలుకు భవిష్యత్తులో మనమందరం కృషి చాయాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. జనవరి 4న జరిగే భారీ బహిరంగ సభకు కర్నూలు జిల్లా నుండి పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మస్తాన్ లవన్న మధు స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు సి. క్యాంపు లోని టి. జి. వి. కళా క్షేత్రంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకరప్ప ఆధ్వర్యంలో పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి పెన్షనర్లను ఉద్దేశించి మాట్లాడారు. సీనియర్ సిటిజన్లు, పెన్షనర్లకు చట్టపరమైన సమస్యలు వస్తే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేస్తే ఉచితంగా న్యాయాసహాయాన్ని అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్స్ సౌకర్యం కోసం 1982 డిసెంబర్ 17న జస్టిస్ చంద్ర చూడ్ ఇచ్చిన తీర్పుతో పెన్షనర్లకు భద్రత కలిగిందన్నారు. ఈ తీర్పు కోసం శ్రమించిన దివంగత డి.ఎస్. నకార జ్ఞాపకార్థం పెన్షనర్ల దినోత్సవం ప్రతి ఏటా డిసెంబర్ 17న జరుపుకుంటున్నామని తెలిపారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ యాక్ట్ పై వారికి అవగాహన కల్పించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవలు మరువలేని అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ హక్కు అని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ భాస్కర్ వర్మ మాట్లాడుతూ బ్యాంకర్స్ సీనియర్ సిటిజెన్, పెన్షనర్స్ కు కల్పించే సౌకర్యాలు ఫిక్సడ్ డిపాసిట్,హెల్త్ పాలసీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెండవ బెటాలియన్ స్పెషల్ పోలీస్ డీఎస్పీ మహబూబ్ బాషా, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ రామస్వామి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ త్రినాథ్ కుమార్, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ షర్మిల రెడ్డి పుట్టినరోజు వేడుకలు



మనగళం, కర్నూలు సిటీ అనాథ ఆశ్రమంలో ఏఐసీసీ సభ్యులు, నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు జిల్లా ఇన్చార్జి జెంగిటి లక్ష్మీనరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనాథ బాలికల మధ్య కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ కేకేసీ చైర్మన్ పఠాన్ అభిబ్ ఖాన్, నంద్యాల పార్లమెంట్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు జాకిర్ హుస్సేన్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఫరూక్ ను కలిసిన న్యాయవాది సురేష్



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : బార్ కౌన్సిల్ మెంబర్ గా పోటీ చేయుచున్న న్యాయవాది కేవీడీ సురేష్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండీ ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం లో మంత్రిని కేవీడీ సురేష్ కలిసి ఆశిస్సులు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి సురుష్ తీసుకెళ్లారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ తీరు మార్చాలి



మనగళం, కర్నూలు సిటీ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) పని తీరు మార్చాలి రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షులు వీవీ నాయుడు కోరారు. కర్నూలు నగరంలోని బిర్లా కంపౌండ్ లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపించారు. అర్జీదారుడి అనుమతి లేకుండా కంప్లైంట్ క్లోజ్ చేసే విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, స్పష్టమైన ఉత్తర్వులు, చర్యల నివేదిక లేకుండా పరిష్కారం చూపినట్లుగా నమోదు చేయకుండా చూడాలని తెలిపారు. డెబ్బై ఐదు రోజుల గడువు దాటిన ప్రతి ఫిర్యాదు పై ఉన్నత స్థాయి అధికారులు తప్పనిసరిగా సమీక్ష చేసే విధానం తీసుకురావాలని కోరారు. గ్రామ, మండల స్థాయి అధికారుల వద్ద ఎన్నిసార్లు తిరిగినా సమస్యలు పరిష్కారం కాక చివరి ఆశగా జిల్లా కలెక్టర్ ప్రజా వేదికకు వస్తే అక్కడ కూడా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీ రాయడం తెలియక డబ్బులు ఇచ్చి రాయించుకుని, గంటల తరబడి ఎదురు చూసి కంప్లైంట్ నమోదు చేయించుకున్నా, చాలా తక్కువ సమస్యలే పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రజా వేదికలో నమోదైన ఫిర్యాదులను డెబ్బై ఐదు రోజుల గడువు పూర్తయ్యేలోపే అధికారులు పరిశీలిస్తామని పేర్కొని, అర్జీదారుల వద్ద సంతకాలు తీసుకుని సమస్య పరిష్కారం కాకపోయినా కంప్లైంట్ లను క్లోజ్ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రజలకు మీ సమస్య పరిష్కరించబడింది అనే సందేశం రావడం అత్యంత దుర్మార్గమైన మోసమని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ తీరు మార్చాలని విన్నవించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు మల్లికార్జున, రైతులు, గిడ్డయ్య, హరిదాసు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## సంతోష్ ట్రోఫీ కి నరసింహుడు ఎంపిక

మనగళం, కర్నూలు సిటీ : జాతీయస్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు కర్నూలు జిల్లా చెందిన నరసింహుడు ఎంపి కేయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున ఈనెల 18 నుండి 22 వరకు అనంతపూర్ ఆర్డిటి గ్రౌండ్స్ లో జరిగే జాతీయస్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్బాల్ పోటీల్లో పాల్గొంటారని కర్నూల్ ఫూట్ బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు జరిగిన అభినందన సభలో కర్నూల్ డిస్టిక్ ఫుట్బాల్ ప్రెసిడెంట్ ముప్పారావ్ శేఖర్ జిల్లా క్రీడాకారుడు సంతోష్ ట్రోఫీకి ఎంపిక కావడం గర్వించ దగ్గ విషయం జాతీయస్థాయిలో కూడా చక్కటి ప్రతిభను కనపరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సెక్రటరీ శ్రీనివాసులు, డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ క్రీడాకారుడితోపాటు కోచ్ బబ్లు శ్రీనివాసులు అభినందించారు.

## అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని 52 వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువుల్లోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన రూ.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని వార్డుల వారీగా సమీక్షించారు. రూ.23 కోట్లు సాధారణ నిధులతో రూ.1.50 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో, రూ.60 లక్షలు ఎన్‌క్యాప్ నిధులతో జరుగుతున్న పనులపై కమిషనర్ పురోగతి వివరాలు తెలుసుకున్నారు. పనుల నాణ్యత, వేగం, పర్యవేక్షణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అవసరమైన చోట గుత్తేదారులపై ఒత్తిడి పెంచి, జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు జరగాలని ఆయన స్పష్టం చేశారు.

## ఏఎస్ ఐ, వీఆర్వోను సస్పెండ్ చేయాలి



మనగళం, కర్నూలు సిటీ : ఒంటరి మహిళ పొలిశెట్టి సరస్వతిని మోసగించి ఆస్తిని కాజేసిన ఏఎస్ఐ మల్లేశ్వరితోపాటు తిమ్మాపురం వీఆర్వో సురేంద్ర రెడ్డి ని సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. పట్నం రాజేశ్వరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొలిశెట్టి సరస్వతి భర్త పొలిశెట్టి నాగ పుల్లయ్య, ఏఎస్ఐ మల్లేశ్వరి భర్త పొలిశెట్టి శ్రీనివాసులు అన్నదమ్ములు. పొలిశెట్టి సరస్వతి భర్త పొలిశెట్టి నాగ పుల్లయ్య 2020లో చనిపోయాడు. ఈ దంపతులకు పిల్లలు లేనందున తోడుకోడులు ఏఎస్ఐ మల్లేశ్వరి భర్త పొలిశెట్టి శ్రీనివాసులుతో కలిసి పొలిశెట్టి సరస్వతి ఆస్తిని కాజేసేందుకు కుట్రలు పన్నారు. తిమ్మాపురం వీఆర్వో సురేంద్ర రెడ్డి సహకారంతో నాగ పుల్లయ్య పేరు మీద వున్న అడంగల్, వన్ బీ, పాసు పుస్తకాలు ఆన్ లైన్ రెవెన్యూ రికార్డులు అన్నీ మల్లేశ్వరి కుటుంబ సభ్యుల పేరు మీద మార్చుకున్నారు. చనిపోయిన పొలిశెట్టి నాగ పుల్లయ్య సంతకాలు ఫోర్జరీ చేసి తప్పుడు వీలునామా డాక్యుమెంట్ సృష్టించారు. గతంలో పొలిశెట్టి నాగ పుల్లయ్య, తమ్ముడు పొలిశెట్టి శ్రీనివాసులు నంద్యాల నందలి ఎన్జీఓ కాలనీలో చెరో ప్లాట్ ను కొనుగోలు చేశారు. ప్లాట్ లో ఇల్లు కట్టిస్తానని సరస్వతి బ్యాంకు ఖాతాలో వున్న డబ్బు మొత్తం తీసుకుని శ్రీనివాసులు తన ప్లాటు, తన అన్న ప్లాటు కలిపి ఒకటే పెద్ద భవనం కట్టించి సరస్వతి ని ఇంట్లో వుండనివ్వకుండా గెంటేశారు. సరస్వతి ఆస్థి అని అడిగితే ఎక్కువగా మాట్లాడితే బొక్కలో వేస్తా అని ఏఎస్సై మల్లేశ్వరి భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరిస్తున్నారు. దీంతో బాధితురాలు ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక ను ఆశ్రయించారన్నారు. బాధితురాలు సరస్వతి సమస్యపై నంద్యాల జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి వినతి పత్రాలు అందజేశామని, సానుకూలంగా స్పందించారని పట్నం రాజేశ్వరి తెలిపారు. ఏఎస్సై మల్లేశ్వరి ఆమె భర్త శ్రీనివాసులు పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్

**– వాష్ అండ్ గో'**





మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రాత్రి, తెల్లవారుజామున తిరిగే వాహనాలలో సరైన భద్రతా చర్యలు, జాగ్రత్తలు పాటించాలని కర్నూల్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్ల లైసెన్సుల వంటి భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు కర్నూలు పోలీసులు భారీ వాహానాలకు "స్టాప్ – వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, కర్నూలు సబ్ డివిజన్ లలో హైదరాబాద్– బెంగుళూరు, హైదరాబాద్ చైన్నె ల నేషనల్ హైవే 40, నేషనల్ హైవే 44 ల లో లారీలు, ప్రవేట్ ట్రావెలింగ్ బస్సులు, ఆర్టీసి బస్సులు , కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరోలను పోలీసులు ఆపి ఆ డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. వాహనాలను అతి వేగంతో నడపకుండా, రాంగ్ రూట్ లో వెళ్ళకుండా, పరిమితికి మించి ప్రయాణీకులకు ఎక్కించుకునే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలియజేశారు.

## ఘనంగా షర్మిలా రెడ్డి జన్మదిన వేడుకలు




మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి జన్మదిన వేడుకలు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి షర్మిలమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని బాషా మాట్లాడారు. షర్మిలారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్ సీ బజారన్న, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాశ్ రెడ్డి, ఓబీసీ సెల్ చైర్మన్ డీవీ సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కే రాఘవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎం శివానంద్, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి రియాజుద్దీన్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, ఐఎన్ టీయూసి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు బి హైమావతి, నాయకులు డబ్ల్యు సత్యరాజు, మాలిక్ బాషా, కిషోర్, కేశవరెడ్డి, రవి, రంగస్వామి దస్తగిరి, సలోమీ, బి సుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా సాధన కోసం బీజేపీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తాం.

**– బీజేపీ మీడియా సెల్ రాష్ట్ర కో కన్వీనర్ తెలుగు అంబన్న.**




( ఆలూరు మనగళం ):కర్నూలు జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోని ను జిల్లాగా చేయాలంటూ బీజేపీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తానని బీజేపీ మీడియా సెల్ రాష్ట్ర కో కన్వీనర్ తెలుగు అంబన్న అన్నారు. బుధవారం ఆలూరులో జెఏసి అద్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలకు ఎపి యుడబ్ల్యూజే నాయకులు దీక్ష చేపట్టారు. వీరికి ఆయన సంఘీభావం ప్రకటించారు. జిల్లా అయితేనే ఆదోని పరిధిలోని 5 నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇందుకోసం పార్టీలకు అతీతంగా అందరూ దీక్షలో పాల్గొని జిల్లా సాధన కోసం మద్దతు ఇవ్వాలన్నారు. జిల్లా సాధన కోసం జర్నలిస్ట్ లు ముందుకు రావడం హర్షణీయం అన్నారు. జిల్లా అయితే పాలన సౌలభ్యంతో పాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇందుకోసం బిజెపి మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రవీంద్ర రావు, తిమ్మప్ప, మాజీ జడ్పీటిసి రాంబింనాయుడు, జెఏసి నాయకులు భూపేష్, కత్తి రామాంజినేయులు, చంద్రకాంత్ రెడ్డి, కొట్టాల రాజు, జర్నలిస్టు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## కోడుమూరులో గ్రంధాలయ కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్న కేడీసీసీ చైర్మన్





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరులో స్థానికంగా కోడుమూరు పాత బస్టాండ్ దగ్గర గల గ్రంథాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని నూతనంగా విద్యార్థులకు పాఠకులకు అనుగుణంగా నిర్మించడానికి ఈరోజు కోడుమూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మరియు కేడీసీ బృందం కలిసి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ డి. విష్ణువర్ధన్ రెడ్డి మరియు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కలిసి వినతి పత్రము సమర్పించడం జరిగినది. టిడిపి ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి కోడుమూరులో గ్రంథాలయ కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ప్రత్యేక చొరవ తీసుకొని కొత్త భవనం నిర్మిస్తామని మాట ఇచ్చారు. ఈ ప్రభుత్వ స్థలాన్ని ఏ ప్రైవేట్ వ్యక్తులు అన్యాక్రాంతము చేసుకోవాలనుకున్న ఉపేక్షించేది లేదని అన్నారు. ఎమ్మెల్యే కూడా దీనిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి ప్రజల కోరిక మేరకు విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ప్రజా సంఘాలు వామపక్షాలు తెలుగుదేశం పార్టీ నాయకులు వారి విజ్ఞప్తి మేరకు గ్రంథాలయం నిర్మించి తీరుతామని చెప్పడం జరిగినది. విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే తక్షణమే స్పందించి పరిష్కరించ దిశలో హామీ ఇచ్చినందుకు కోడుమూరు అభివృద్ధి కమిటీ వారు వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

## కొత్త ఏడాదిలో వినియోగదారులకు గట్టి షాక్ ఇవ్వనున్న ఎయిర్‌టెల్, జియో..

ముంబయి డిసెంబర్ 17 డిజైనర్ టెక్ గురు ప్రతినిధిమొబైల్ ఇంటర్నెట్ వినియోగదారులకు 2026 కొత్త ఏడాది భారీ షాక్ ఇవ్వబోతోందని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా ప్రకారం వచ్చే ఏడాది టెలికాం కంపెనీలు 4+, 5+ ప్లాన్‌ల టారిఫ్‌లను భారీగా పెంచే అవకాశముంది. ముఖ్యంగా 2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌ల ధరలు 16 నుంచి 20 శాతం వరకు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని సంస్థ తన నివేదికలో వెల్లడించింది.ఇటీవల టెలికాం కంపెనీలు తీసుకుంటున్న నిర్ణయాలు ఈ ధరల పెంపుకు స్పష్టమైన సంకేతాలుగా మారుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. తక్కువ ధర ప్లాన్‌లను క్రమంగా నిలిపివేయడం, స్ట్రీమింగ్ సేవలను కేవలం ప్రీమియం ప్లాన్‌లకే పరిమితం చేయడం వంటి చర్యలు వినియోగదారులను అధిక ధరలకు అలవాటు చేయడానికేనని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. గత ఎనిమిదేళ్లలో ఇది నాలుగో ప్రధాన టారిఫ్ పెంపు కావడం గమనార్హం. గతంలో 2019లో 30 శాతం, 2021లో 20 శాతం, 2024లో 15 శాతం వరకు ధరలు పెరిగిన సంగతి తెలిసిందే.ఈ పరిస్థితుల్లో ఎయిర్‌టెల్, జియో వంటి బలమైన కంపెనీలకు లాభాలు మరింత పెరుగుతాయని అంచనా. ఆదాయ వృద్ధి జరిగిన ప్రతిసారీ బలహీన సంస్థలు వెనుకబడిపోతున్నాయని నివేదిక స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎయిర్‌టెల్ పరిశ్రమలో ఆదాయ వాటా 2024 ప్రారంభంలో 36 శాతంగా ఉండగా, 2028 నాటికి అది 40 శాతం కంటే ఎక్కువకు చేరుతుందని అంచనా. అదే సమయంలో వోడాఫోన్ ఐడియా ఆదాయ వాటా 24 శాతం నుంచి 18 శాతానికి పడిపోయే అవకాశముందని పేర్కొంది.సబ్‌స్క్రైబర్ల పరంగానూ ఇదే ట్రెండ్ కొనసాగనుంది. 2028 నాటికి వోడాఫోన్ ఐడియా వినియోగదారుల వాటా 29 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తుండగా, ఎయిర్‌టెల్ వాటా సుమారు 32 శాతం వద్ద స్థిరంగా కొనసాగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. జియో కూడా తన బలమైన మార్కెట్ స్థితిని కొనసాగించే అవకాశముందని అంచనా వేస్తున్నారు.ఇక భవిష్యత్‌లో సగటు ఆదాయం పర యూజర్ మరింత పెరగనుందని నివేదిక వెల్లడించింది. 2032 నాటికి రూ.370 నుంచి రూ.390 వరకు చేరుతుందని అంచనా. డేటా ధరల పెరుగుదల, పోస్ట్‌పెయిడ్ వినియోగదారుల సంఖ్య పెరగడం, రోమింగ్ ప్యాకేజీలు, దేశీయ ప్రయాణాలు పెరగడం దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. 5జి నెట్‌వర్క్ నిర్మాణం దాదాపు పూర్తయిన నేపథ్యంలో, ఒకప్పుడు ఆదాయంలో 30 శాతం వరకు ఉన్న క్యాపెక్స్ ఖర్చులు ఇప్పుడు 20 శాతం కంటే తక్కువకు తగ్గుతున్నాయి. దీని వల్ల ఎయిర్‌టెల్, జియోలకు నగదు ప్రవాహం మరింత బలపడనుందని అంచనా.మోర్గాన్ స్టాన్లీ అంచనా ప్రకారం 2026–27 నాటికి ఎయిర్‌టెల్ ఇండియా వ్యాపారం మాత్రమే సుమారు 8 బిలియన్ డాలర్ల ఉచిత నగదు ప్రవాహాన్ని సృష్టించే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే కొత్త ఏడాదిలో వినియోగదారులపై టారిఫ్ భారం పెరగనుండగా, టెలికాం రంగంలో ఎయిర్‌టెల్, జియోలకు మాత్రం ఇది లాభదాయకమైన కాలంగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## అంతర్జాతీయ వలసదారుల దినం ప్రపంచాన్ని మోస్తున్న చేతులు, ప్రశ్నల మధ్య జీవితం

మనిషి చరిత్రంతా కదలికల చరిత్రే. ఆహారం కోసం, భద్రత కోసం, అవకాశాల కోసం మనిషి స్థలం మార్చుకుంటూ వచ్చాడు. కానీ ఆధునిక ప్రపంచంలో వలస అనేది కేవలం ప్రయాణం కాదుబీ అది ఒక బతుకు పోరాటం. స్వదేశంలో సరైన ఉపాధి లేక, అప్పులు పెరిగి, కుటుంబ భవిష్యత్తుపై భయం వెంటాడి, కోట్ల మంది వలస మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దేశాలు దాటే ఆ ప్రయాణంలో ఆశతో పాటు అనిశ్చితి కూడా కలిసే నడుస్తుంది. అంతర్జాతీయ వలసదారుల దినం ఈ నిశ్శబ్ద పోరాటాన్ని గుర్తు చేసే సందర్భం.

వలసకు ప్రధాన కారణాలు ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, రాజకీయ అశాంతి, యుద్ధాలు, వాతావరణ మార్పుల ప్రభావాలు. ఒకప్పుడు ఐచ్ఛికంగా కనిపించిన వలస, ఇప్పుడు బలవంతపు పరిస్థితిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కరువవ్వడం వల్ల పట్టణాలకు వలస, అక్కడి నుంచి అంతర్జాతీయ వలసగా మారుతోంది. కుటుంబాన్ని వదిలి వెళ్లే ప్రతి వ్యక్తి వెనుక ఒక తల్లి ఆందోళన, ఒక భార్య నిరీక్షణ, ఒక పిల్లవాడి ప్రశ్న దాగి ఉంటుంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వలసదారుల శ్రమ మీద ఎంతగా ఆధారపడిందో చెప్పాల్సిన అవసరం లేదు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, వ్యవసాయం, గృహ సేవలు, వైద్య సేవలు, రవాణా ఈ రంగాలన్నింటిలోనూ వలస కార్మికుల పాత్ర కీలకం. అభివృద్ధి చెందిన దేశాల్లోని మెరిసే నగరాలు, ఆకాశహర్మ్యాలు, వేగవంతమైన సేవలు వలసదారుల కష్టానికి ప్రతిరూపాలు. వారు సంపాదించి స్వదేశాలకు పంపే డబ్బుతో అనేక దేశాల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు నిలబడుతున్నాయి. అయినా సరే, వారి జీవితం మాత్రం భద్రత లేకుండా సాగుతోంది.

వలసదారులు ఎదుర్కొనే సమస్యలు ఒకటి కాదు, ఎన్నో. తక్కువ వేతనాలు, ఒప్పందాల ఉల్లంఘనలు, ప్రమాదకర పని పరిస్థితులు, పని గంటల దోపిడీ, భాషా సమస్యలు, చట్టపరమైన అవగాహన లోపంఇవన్నీ వారి రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. కొన్ని దేశాల్లో వలసదారులను రెండో తరగతి పౌరుల్లా చూడటం, సామాజిక వివక్షకు గురిచేయడం కూడా కనిపిస్తోంది. అక్రమ వలసదారులనే ముద్రతో మానవ హక్కులను కూడా ప్రశ్నార్థకం చేయడం సమాజపు వైఫల్యాన్ని చూపిస్తోంది.

మహిళా వలసదారుల పరిస్థితి మరింత కఠినం. పని ప్రదేశాల్లో వేధింపులు, నివాస అసురక్షితత, ఆరోగ్య సేవల కొరత వారికి అదనపు భారంగా మారుతోంది. పిల్లలతో కలిసి వలస వెళ్లిన కుటుంబాలు విద్య, పోషణ, భద్రత వంటి అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వలస అనేది కుటుంబాల్ని చీల్చే ప్రక్రియగా మారుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

అంతర్జాతీయ వలసదారుల దినం కేవలం ఒక అవగాహన దినంగా పరిమితం కాకూడదు. వలసదారుల హక్కులను రక్షించే చట్టాలు అమలులోకి రావాలి. ప్రభుత్వాలు వలసను సమస్యగా కాకుండా, సమగ్ర అభివృద్ధిలో భాగంగా చూడాలి. సురక్షిత వలస మార్గాలు, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత, ఆరోగ్య%-%విద్య సదుపాయాలు అందించడం అత్యవసరం. యజమానులు వలస కార్మికులను చౌక శ్రమగా కాకుండా, గౌరవంతో కూడిన మనుషులుగా చూడాల్సిన బాధ్యత ఉంది.

ప్రపంచం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్న ఈ సమయంలో, ఆ పరుగుల వెనుక నిలిచిన వలసదారుల కన్నీళ్లు కనిపించకపోతే అది అసంపూర్ణ అభివృద్ధే. సరిహద్దులు మారినా, జెండాలు మారినా, భాషలు మారినామనిషి గౌరవం మారకూడదు. వలసదారుల శ్రమకు గౌరవం, వారి జీవితాలకు భద్రత, వారి హక్కులకు న్యాయం లభించినప్పుడే అంతర్జాతీయ వలసదారుల దినానికి నిజమైన అర్థం వస్తుంది. మనిషి చరిత్రంతా కదలికల చరిత్రే. ఆహారం కోసం, భద్రత కోసం, అవకాశాల కోసం మనిషి స్థలం మార్చుకుంటూ వచ్చాడు. కానీ ఆధునిక ప్రపంచంలో వలస అనేది కేవలం ప్రయాణం కాదుబీ అది ఒక బతుకు పోరాటం. స్వదేశంలో సరైన ఉపాధి లేక, అప్పులు పెరిగి, కుటుంబ భవిష్యత్తుపై భయం వెంటాడి, కోట్ల మంది వలస మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దేశాలు దాటే ఆ ప్రయాణంలో ఆశతో పాటు అనిశ్చితి కూడా కలిసే నడుస్తుంది. అంతర్జాతీయ వలసదారుల దినం ఈ నిశ్శబ్ద పోరాటాన్ని గుర్తు చేసే సందర్భం.

వలసకు ప్రధాన కారణాలు ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, రాజకీయ అశాంతి, యుద్ధాలు, వాతావరణ మార్పుల ప్రభావాలు. ఒకప్పుడు ఐచ్ఛికంగా కనిపించిన వలస, ఇప్పుడు బలవంతపు పరిస్థితిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కరువవ్వడం వల్ల పట్టణాలకు వలస, అక్కడి నుంచి అంతర్జాతీయ వలసగా మారుతోంది. కుటుంబాన్ని వదిలి వెళ్లే ప్రతి వ్యక్తి వెనుక ఒక తల్లి ఆందోళన, ఒక భార్య నిరీక్షణ, ఒక పిల్లవాడి ప్రశ్న దాగి ఉంటుంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వలసదారుల శ్రమ మీద ఎంతగా ఆధారపడిందో చెప్పాల్సిన అవసరం లేదు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, వ్యవసాయం, గృహ సేవలు, వైద్య సేవలు, రవాణా ఈ రంగాలన్నింటిలోనూ వలస కార్మికుల పాత్ర కీలకం. అభివృద్ధి చెందిన దేశాల్లోని మెరిసే నగరాలు, ఆకాశహర్మ్యాలు, వేగవంతమైన సేవలు వలసదారుల కష్టానికి ప్రతిరూపాలు. వారు సంపాదించి స్వదేశాలకు పంపే డబ్బుతో అనేక దేశాల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు నిలబడుతున్నాయి. అయినా సరే, వారి జీవితం మాత్రం భద్రత లేకుండా సాగుతోంది. వలసదారులు ఎదుర్కొనే సమస్యలు ఒకటి కాదు, ఎన్నో. తక్కువ వేతనాలు, ఒప్పందాల ఉల్లంఘనలు, ప్రమాదకర పని పరిస్థితులు, పని గంటల దోపిడీ, భాషా సమస్యలు, చట్టపరమైన అవగాహన లోపంఇవన్నీ వారి రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. కొన్ని దేశాల్లో వలసదారులను రెండో తరగతి పౌరుల్లా చూడటం, సామాజిక వివక్షకు గురిచేయడం కూడా కనిపిస్తోంది. అక్రమ వలసదారులనే ముద్రతో మానవ హక్కులను కూడా ప్రశ్నార్థకం చేయడం సమాజపు వైఫల్యాన్ని చూపిస్తోంది.

మహిళా వలసదారుల పరిస్థితి మరింత కఠినం. పని ప్రదేశాల్లో వేధింపులు, నివాస అసురక్షితత, ఆరోగ్య సేవల కొరత వారికి అదనపు భారంగా మారుతోంది. పిల్లలతో కలిసి వలస వెళ్లిన కుటుంబాలు విద్య, పోషణ, భద్రత వంటి అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వలస అనేది కుటుంబాల్ని చీల్చే ప్రక్రియగా మారుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

అంతర్జాతీయ వలసదారుల దినం కేవలం ఒక అవగాహన దినంగా పరిమితం కాకూడదు. వలసదారుల హక్కులను రక్షించే చట్టాలు అమలులోకి రావాలి. ప్రభుత్వాలు వలసను సమస్యగా కాకుండా, సమగ్ర అభివృద్ధిలో భాగంగా చూడాలి. సురక్షిత వలస మార్గాలు, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత,

# కొత్తూరులో వసతి గృహ నిర్మాణానికి విరాళం

మనగళం, పాణ్యం : పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన ప్రముఖ శైవక్షేత్రం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న వసతి గృహ నిర్మాణానికి భక్తులు రూ. 3 లక్షలు విరాలం ఇచ్చారు. పాణ్యం మండలం గోనవరం గ్రామానికి చెందిన దివంగత బండారు వెంకటసుబ్బయ్య సతీమణి బండారు వెంగళమ్మ జ్ఞాపకార్థం వారి ముని మనవడు బండారు నాగ మనోజ్ విరాళం అందజేశారని ఈఓ రామకృష్ణ తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి పూలమాలలు, శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, గోనవరం మాజీ సర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# గూడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన రాజా కుళ్లాయప్ప

మన గళం గూడూరు : ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ, సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. రాజా కుళ్లాయప్ప , తన శిక్షణ పూర్తి చేసిన అనంతరం చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో పి.ఎస్.ఐగా విధులు నిర్వహించారు.అనంతరం పూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీపై గూడూరు పోలీస్ స్టేషన్‌కు ఎస్.హెచ్.ఓగా నియమితులై, బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సామాజిక వ్యతిరేక శక్తులు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు తక్షణమే తమ ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటే, ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు అదేవిధంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు అన్యాయాలు జరిగినా లేదా పోలీస్ సహాయం అవసరమైన సందర్భాలలో నేరుగా గూడూరు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, ప్రజల హక్కుల పరిరక్షణకు మరియు న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు ప్రజల సహకారంతో గూడూరు పట్టణంలో శాంతి భద్రతలు మరింత మెరుగుపరచడం, నేరరహిత వాతావరణాన్ని నెలకొల్పడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు పోలీస్ శాఖతో సమన్వయం కలిగి పనిచేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఒక్క బస్తా యూరియా 300 కి అమ్ముతున్న అగ్రికల్చర్ రాఘవేంద్ర...





నందవరం డిసెంబర్ 17 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామపంచాయతీకి సంబంధించి బుధవారం రోజున రైతులకు యూరియా సరఫరా చేయడం జరిగింది ఆంధ్రప్రదేశ్‌లో భారత ప్రభుత్వం సబ్సిడీతో అందించే యూరియా బస్తా (50 కిలోలు) ధర సుమారు 260 నుండి 270వరకు ఉంటుంది. అయితే, పెద్దకొత్తిలి అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ రాఘవేంద్ర మాత్రం రైతులకు యూరియా 300 పైగా అమ్ముతున్నట్టు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు వ్యవసాయానికి కావలసిన యూరియా సరఫరా చేస్తుంటే పెద్దకొత్తిలి ఆర్ బి కే అక్కడున్న అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ రాఘవేంద్ర మాత్రం రైతులకు అక్రమంగా గవర్నమెంట్ రేట్ కాదని 300 కి పైగా ఒక బస్తా అమ్ముతున్నాడని రైతులు గుసగుసలు వినపడుతున్నాయి రైతులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు ఎలాంటి ఎరువులు గురించి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు అదేవిధంగా రైతులకు అందాల్సిన బస్తానో ఎక్కువ రేటుకు అమ్మటం భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా పై అధికారులు స్పందించి పెద్దకొత్తిలి అగ్రికల్చర్ రాఘవేంద్ర పై చర్యలు తీసుకొని విచారణ చేసి ఉంటే బాగుంటుందని అంటున్నారు.

# జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యుత్తు పొదుపు వారోత్సవాలు

మన గళం కోడుమూరు: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా, జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడుమూరు నందు విద్యార్థులకు విద్యుత్ ఆదాపై, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగినది. కోడుమూరు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీరు,జే మధుసూదన్ విద్యుత్ వారోత్సవాల సందర్భం గ పాఠశాల విద్యార్థులకు విద్యుత్ పొదుపు, విద్యుత్తు వినియోగము, భవిష్యత్తు తరాల అవసరాలకు , విద్యుత్ వినియోగము అనే అంశంపై సందేశము ఇవ్వడము జరిగినది. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన, విద్యుత్ పొదుపు అనే అంశంపై అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రుడు, ఉపాధ్యాయులు తిరుమల రెడ్డి, ఉస్మాన్ భాష, రాజేశ్వరి , విజయలక్ష్మి, గాజుల కృష్ణమోహన్ మరియు విద్యుత్ శాఖ అధికారులు, గిరి టెక్నికల్ అసిస్టెంట్ , లైన్ మెన్ రమేష్, లైన్ మెన్ సుభాన్ పాల్గొన్నారు



# లైంగిక దాడి కేసులో ముద్దాయికి ఏడేళ్లు జైలు శిక్ష

మనగళం, నంద్యాల : నంద్యాల మండలం పరిధిలోని రైతునగరం సమీపంలోని సైజిత్ కాలనీ అవుట్‌ఫీల్డ్స్‌లో 25.04.2025 వ తేదీన సాయంత్రం సుమారు ఏడేళ్ల మైనర్ బాలికపై రుద్రవరం మండలం, ఆలమూరు గ్రామనికి చెందిన యాగసిరి గోవిందు అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనపై హేమేంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ధనమ్మ కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ సంజీవరాయుడు సాక్షాధారాలు కోర్టుకు సమర్పించగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫోక్సో కోర్టు సీవీ శ్రీనివాసులు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడేళ్లు జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా, రూ. లక్ష పరిహారం బాధిత మైనర్ బాలికకు ఇవ్వాలని జడ్జి తీర్పు ఇచ్చారు.ఖ



## జీరామ్ జీ బిల్లును వెనక్కి తీసుకోవాలి



మనగళం, నంద్యాల: జీరామ్ జీ బిల్లును వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా నాయక్, సీఐటీయూ నాయకులు మహమ్మద్ గౌస్, లక్ష్మణ్, బాల వెంకట్, తోట మద్దులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల నాయకులు బండి రత్నమయ్య అధ్యక్షతన సాయిబాబా నగర్ సెంటర్ లో జీరామ్ జీ బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004లో వామపక్ష 60 మంది ఎంపీలు గ్రామీణ వలసలు,పేదలకు కడుపు నింపే చట్టం కావాలని యూపీఏ2 ప్రభుత్వాన్ని బలపరిచిన సందర్భంగా 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ చట్టాన్ని పార్లమెంట్లో చట్టం చేశారని గుర్తు చేశారు. దేశంలో ఈ చట్టం వచ్చాక గ్రామీణ పేదలు, చిన్నసన్నకారు రైతుల భూములు సాగు లోకి వచ్చాయన్నారు. అయితే బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రాష్ట్రాల పరిధిలో ఉండే హక్కును తొలగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్.ఐ.సి పేరుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ఆధీనంలో ఉంచుకొని ఆ చట్టాన్ని సంవత్సరం సంవత్సరం బడ్జెట్లో కోతలు విధిస్తూ గ్రామీణ పేదల కూలీల ఉపాధి దెబ్బతీస్తూ వచ్చిందన్నారు. పేదలకు ఆర్థికంగా ఉపయోగపడే చట్టాన్ని పేరు మార్చి కొత్తగా వీబీజీ రామ్ జీబిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడం ముఖ్య ఉద్దేశం నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్ వాటికి దోచి పెట్టడానికే అని ఆరోపించారు. గ్రామీణ పేదల కడుపు కొట్టే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసా కార్మిక సంఘం జిల్లా నాయకులు బండి రత్నమయ్య, కృష్ణ,సత్యం, శ్రీనివాసులు, రంగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ, నాగార్జున నాయక్, హమాలి నాయకులు పాల్గొన్నారు.

# ఆదోని జిల్లా సాధన కోసం మేము సైతం.

- కదం తొక్కిన ఆలూరు జర్నలిస్ట్ లు. - జిల్లా చేయాలని రాస్తారో కో.
- దీక్ష లో కూర్చొని మద్దతు పలికిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు. - సంఘీభావం తెలిపిన రాజకీయ పార్టీల నేతలు.






(ఆలూరు మనగళం):ఆదోని ను జిల్లా గా ప్రకటించాలని కోరుతూ పాలూరు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు స్థానిక అంబేద్కర్ కూడారిలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం జేఏసీ చేపట్టిన రిలే దీక్షల్లో కూర్చున్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఎపియూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు టిడిపి నాయకులు రఘు ప్రసాద్ రెడ్డి, అట్టేకల్ జగన్ మోహన్ బాబు, బిజెపి రాష్ట్ర మీడియా కో కన్వీనర్ అంబన్న, తాలూకా నాయకులు తిమ్మప్ప, రవీంద్ర రావు, బసవరాజు, మాజీ జడ్పీటిసి రాంబీం నాయుడు, ఆదోని జెఏసి నాయకులు ఆదినారాయణ రెడ్డి, ఆస్పరి ఎంపీపీ సుంకరి ఉమాదేవి, రామాంజినేయులు, జెఏసి నాయకులు కత్తి రామాంజినేయులు, భూపేష్, రామాంజినేయులు, చంద్రకాంత్ రెడ్డి, ఆర్ టి యాక్ట్ జిల్లా నాయకులు కొట్టాల రాజు సంగీబావం ప్రకటించారు. దీక్షల్లో ఏపీయూడబ్ల్యూజే నాయకులు స్వరూప్, శ్రీధర్, చంద్రమోహన్, సురేష్, నాగ్, గోపాల్, రామ్ మోహన్, రంగస్వామి, భీమా, బద్రి, గోపాల్, వీర వీరేష్, ఉసేన్, మునిస్వామి, రాయలసీమ వీరేష్, నారాయణ, కిరణ్, ఎర్రిస్వామి, అంజి, డానియల్ పాల్గొన్నారు.




## ఎమ్మిగనూరు అసెంబ్లి వైసిపి సమన్వయకర్త రాజీవ్ రెడ్డి వాక్యాలను ఖండించిన బిజెపి నాయకులు గురురాజ్ దేశాయ్......

నందవరం డిసెంబర్ 17 మనగలం న్యూస్ మండలకేంద్రంయైన నందవరంలోని బిజెపి కార్యలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో బిజెపి నాయకులు గురురాజ్ దేశాయ్ గారు మాట్లాడుచూ నిన్నటిరోజు అదోని జిల్లా సాదన కమిటి చేస్తున్న రిలేనిరాహారదీక్షకు మద్దతు ఇవ్వడానికి వచ్చిన ఎమ్మిగనూరు అసెంబ్లి వైసిపి సమన్వయకర్త రాజీవ్ రెడ్డి గారు బిజెపి పార్టీ మరియు కూటమి ప్రభుత్వం గురించి ఇష్టానుసారంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. అదోని జిల్లా ఏర్పాటుకోసం గతంలో అసెంబ్లీలో గళం విప్పినది ప్రస్తుతం అదోని జిల్లా ఏర్పాటుకోసం పోరాడుచున్న జీూజ కి పూర్తి మద్దతు తెలిపింది స్థానిక బిజెపి ఆదోని మీూ గౌరవనీయులు శ్రీ పార్థసారధి గారు అలాగే మా నాయకుడైనటువంటి బిజెపి జిల్లా అద్యక్షులు రామకృష్ణగారు, ఎమ్మిగనూరులో రిలేనిరాహారదీక్షచేస్తున్న అదోని జిల్లా సాధనకమిటీకి కూడా పూర్తిగా మద్దతు ఇచ్చిన మొట్టమొదటి పార్టీ ఎమ్మిగనూరు అసెంబ్లీ బిజెపి పార్టి నాయకులు. ఈ విషయం తెలియకుండా రాజారెడ్డి గారు తొందరపడి బిజెపి పార్టి గురించి మాట్లాడటం అలాగే కూటమి ప్రభుత్వం అదోని జిల్లా ఏర్పాటుకోసం పొరాడుచున్న వారిని తప్పదోవ పట్టిస్తున్నారని మాట్లాడటం హస్యాస్పదం. అయ్యా రాజీవ్ రెడ్డి గారు మా బిజెపి పార్టి గురించి మీ అధినాయకులు అయినంటువంటి వైసిపి పార్టీ వ్యవస్తాపకులు జగన్మోహన్ రెడ్డి గారు కూడా పల్లెత్తు మాట మాట్లాడరు. మీరు కొత్తగా రాజకీయంలో వచ్చారు కాబట్టి మీకు బిజెపి పార్టి గురించి సరైన అవగాహన లేదు కాబట్టే మీరు అనవసరమైన నిందలు వేస్తున్నారు, అలాగే ఎప్పటికయినా అదోని జిల్లాగా ఎర్పాటు చేసేది అందుకు కృషిచేసేది కూడా కూటమి ప్రభుత్వమే అని మీరు తెలుసుకొంటే మంచిది. ఇదే వైసిపి ప్రభుత్వం గతంలో అదికారంలో ఉన్నప్పుడు అదోని జిల్లాగా ఎర్పాటు చేయాలనే ఆలొచన అప్పుడు మీ జగన్మోహన్ రెడ్డిగారికి కలగలేదా? అంధ్రప్రదేశ్ ప్రజల సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ అయినటువంటి కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రువర్యులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు గారి పరిపాలనలో రాష్ట్రాన్ని అభివృద్ది పతంలో తీసుకెళ్లడం చూస్తూంటే ఓర్చుకోలేక ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నది మీరు మీ వైసిపి పార్టి కాదా? అదోని జిల్లా సాధన కోసం మేముకూడా మద్దతు తెలుపుచున్నామని అదోని డివిజన్ ప్రాంతవాసులమీద సవతిప్రేమ చూపిస్తే ప్రజలు మీ వైసిపి పార్టిని ఎప్పటికి నమ్మరు రాజారెడ్డిగారు...మీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి గారు గతంలో ఒక్కసారి మా పార్టిని గెలిపించండి అని ప్రజలను మభ్యపెట్టి అధికారం చేతికి వచ్చిన తరువాత ఒక్క అభివృద్ది కూడా రాష్ట్రంలో చేసిన దాఖలాలు లేవండి రాజారెడ్డి గారు....ఒక్కటిమాత్రం తెలుసుకొండి అదోని జిల్లాగా ఏర్పాటు చెయ్యడానికి బిజెపి, టిడిపి మరియు జనసేన పార్టీలు కలసి ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని గుర్తుపెట్టుకొండి.



## అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు మంజూరు చేయాలి సిపిఐ

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని వర్కూర్ గ్రామంలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు మంజూరు చేయాలనీ కోరుతూ వర్కూర్ జూ× గ్రామ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ అసిస్టెంట్ సంపత్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బి రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పట్టణ ప్రాంతంలో అప్లై చేసిన ప్రతి పేదవాళ్లకు ఇంటి స్థలం కేటాయించాలని గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలం పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు స్థలం ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అదేవిధంగా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు గత ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న ఇంటి స్థలాలను రద్దుచేసి మరల అప్లై చేసుకోవడానికి లాగిన్ ఓపెన్ చేయాలని వారు డిమాండ్ చేశారు గ్రామ పట్టణాలలో రాజకీయ జోక్యం లేకుండా అప్లై చేసిన ప్రతి వ్యక్తికి ఇండ్ల స్థలం కేటాయించాలని వారన్నారు లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## పాన్ కార్డు అడ్రస్ మార్చుకోవడం ఇక మరింత ఈజీ..

న్యూఢిల్లీ డిసెంబర్ 17 మన గళం :.పాన్ కార్డు ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అత్యంత కీలకమైన పత్రంగా మారింది. బ్యాంకింగ్ సేవలు, జీతం స్వీకరణ, పెట్టుబడులు, పన్నుల దాఖలు వంటి అన్ని ఆర్థిక కార్యకలాపాలకు పాన్ తప్పనిసరి. ఇల్లు మారినప్పుడు లేదా చిరునామా మారిన సందర్భాల్లో పాన్ కార్డులో అడ్రస్ అప్డేట్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఇది కాస్త సమయం పట్టే ప్రక్రియగా ఉండేది. అయితే ఇప్పుడు ఆధార్ సహాయంతో పాన్ కార్డులో అడ్రస్ మార్చుకోవడం చాలా సులభమైంది.ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం అందిస్తున్న ఆధార్ బేస్డ్ ఈ-కేవైసీ విధానం ద్వారా కేవలం కొన్ని నిమిషాల్లోనే పాన్ కార్డు చిరునామాను అప్డేట్ చేసుకునే అవకాశం ఉంది. ఎన్ఎస్‌డీఎల్ పోర్టల్‌లో 'చేంజ్ లేదా కరెక్షన్ ఇన్ పాన్ డేటా' ఎంపికను ఎంచుకుని ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ఆప్షన్‌ను సెలెక్ట్ చేయాలి. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ధృవీకరించిన వెంటనే, ఆధార్‌లో ఉన్న చిరునామానే పాన్ కార్డులో ఆటోమేటిక్‌గా అప్డేట్ అవుతుంది.ఈ ప్రక్రియకు ఎలాంటి అదనపు డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే ఆధార్‌లో చిరునామా ముందుగానే సరిగా అప్డేట్ అయి ఉండాలి. అలాగే ఆధార్-పాన్ లింక్ అయి ఉండటం, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉండటం తప్పనిసరి. పాన్ కార్డులో అడ్రస్ మార్పు కోసం రూ.96 ఫీజు చెల్లించాలి. నెట్ బ్యాంకింగ్, యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డుల ద్వారా ఈ మొత్తాన్ని చెల్లించవచ్చు.అప్డేట్ పూర్తైన వెంటనే ఈ-పాన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం ఉంటుంది.

## కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటలలో కొత్త రకాలపై శిక్షణా కార్యక్రమం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని లద్దగిరి గ్రామంలో మాజీ కేంద్ర మంత్రివర్యులు మరియు ప్రస్తుత డోన్ శాసనసభ సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మామిడి మరియు ఇతర ఉద్యాన పంటలలో కొత్త రకాలపై శిక్షణా కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన కేంద్రం మహానంది కి చెందిన ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఠాగూర్ నాయక్ ప్రస్తుతం మామిడి తోటలో పాటించవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులను తెలియజేశారు అలాగే ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదర్శ రైతు అయినటువంటి రామాంజనేయులు కూడా ఉద్యానవన పంటల రకాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు లద్దగిరి గ్రామంలో కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి పొలంలో మామిడిలో 48 నూతన రకాలు మరియు పనస, నేరేడు, సీతాఫలం, మల్బరీ మరియు తదితర ఉద్యాన పంటల రకాలు సాగు చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశము రైతులందరూ మామిడిలో కొత్త రకాలు తెలుసుకొని రైతులందరూ వారికి లాభసాటి అయినా ఉద్యాన పంటల సాగు చేయడానికి ఈ కార్యక్రమము నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి వరలక్ష్మి మరియు జిల్లా ఉద్యాన అధికారి రాజా కృష్ణారెడ్డి, ఞావీ×ూ పతాక సంచాలకులు శ్రీనివాసులు,జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు , కర్నూల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సాలురెడ్డి, కోడుమూరు వ్యవసాయ అధికారి రవి ప్రకాష్, ఉద్యాన అధికారి మదన్మోహన్, కర్నూల్ డివిజన్ మరియు డోన్ డివిజన్ సంబంధించిన వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు ,రైతు సేవ రైతు సేవ కేంద్ర సిబ్బంది, వివిధ మండల గ్రామ రైతులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు



మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక

## ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 17.12.2025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (జ్వాలావీరభద్రస్వామివారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేషఅభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది.

కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.



## శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం :లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 17.12.2025) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది.కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

## నందీశ్వరస్వామివారికి విశేషపూజలు





మనగళం శ్రీశైలం త్రయోదశి సందర్భంగా ఈ రోజు (17.12.2025) నందీశ్వరస్వామి వారికి పరోక్షసేవగా విశేషార్చన జరిపించబడుతోంది. ( ఎ˘ తీ మంగళవారం రోజున మరియు త్రయోదశిరోజులలో దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. అయితే ప్రతి నెలలో కూడా త్రయోదశి రోజులలో అనగా శుద్ధ త్రయోదశి మరియు బహుళ త్రయోదశి రోజులలో భక్తులు నందీశ్వరస్వామివారి పూజను పరోక్షసేవగా జరిపించుకునే అవకాశం కూడా కల్పించబడింది. కాగా ఈ రోజు మొత్తం 58 మంది భక్తులు పరోక్షసేవగా ఈ నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకుంటున్నారు. ఈ పరోక్షసేవలో తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, న్యూఢిల్లీ నుండి కూడా భక్తులు ఈ విశేషపూజను నిర్వహించుకుంటున్నారు. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతోంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతోంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. కాగా త్రయోదశి రోజున జరిపించబడే నందీశ్వరస్వామివారి పరోక్షసేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116/-లను సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు సేవారుసుమును షషష. ఒతీఅయిఖఅశ్రీఖనవఝుర్ష్ఖుఅఖుఎ.శీతీస్త్ర లేదా .స్త్రశీజ.అఅ ద్వారా చెల్లింపు చేయవచ్చు. నందీశ్వరస్వామివారి ఆరాధన వలన సంతానంలేనివారికి సంతానం కలుగుతుందని, సమస్యలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని, ఋణబాధలు తీరుతాయని, అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని, కష్టాలు నివారించబడతాయని, మానసిక ప్రశాంతత చేకూరుతుందని పండితులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఈ స్వామికి నానబెట్టినశనగలను సమర్పించడం వలన కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది. అందుకే ఈ స్వామివారికి శనగలబసవన్న అనే పేరు కూడా ప్రసిద్ధంగా ఉంది. ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతున్నది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును. కావున భక్తులందరు కూడా ఈ పరోక్షసేవను సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాము.
ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 లను సంప్రదించవచ్చును.

## సాంస్కృతిక కార్యక్రమాలు



మనగళం శ్రీశైలం : శ్రీశైలం దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (16.12.2025) నటరాజ నృత్య అకాడమి, వికారాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఈ కార్యక్రమములో గణనాయక, లింగాష్టకం, నటరాజస్తుతి, దేవిస్తుతి,, భో...శంభో, నమశ్శివాయతే, అదిగదిగో శ్రీశైలం, శివతాండవం తదితర గీతాలకు చైత్ర, షణ్ముఖప్రియ, హరిణి తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కా గా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# శ్రీశైల దర్శన ఆన్‌లైన్ టికెట్ల జారీ సమీక్ష





మనగళం శ్రీశైలం భక్తుల సౌకర్యార్థమై దేవస్థానం అమలు చేస్తున్న ఆన్‌లైన్ విధానాన్ని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు ఈరోజు (17.12.2025) సమీక్షించారు. అన్ని శాఖల అధిపతులు, అన్ని విభాగాల పర్యవేక్షకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవస్థానం ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ ఆన్‌లైన్ ద్వారా భక్తులు శ్రీస్వామివారి స్పర్శదర్శనం, అతిశీఘ్రదర్శనం రూ. 300ల , శీఘ్రదర్శనం రూ. 150/-ల టికెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అలాగే శ్రీస్వామివారి ఆర్జిత గర్భాలయ అభిషేకం, ఆర్జిత సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతిహోమం, రుద్రహోమం, మహామృత్యుంజయహోమం, చండీహోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం మొదలైన 14 ఆర్జితసేవలకు సంబంధించిన సేవాటిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని పేర్కొన్నారు. అదేవిధంగా వసతిని కూడా ముందస్తుగా ఆన్‌లైన్‌లో రిజర్వు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. ఇందుకోసం భక్తులు రాష్ట్ర దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్ షషష.ఖజ్ఞవఎ-జూశ్రీవం.ఖజూ.స్త్రశీజ.అఅ లేదా దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ షషష.ఒతీఅ-ఖఅశ్రీఖనవఝుర్ష్ఖుఅఖుఎ.శీతీస్త్ర ల ను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా కూడా 14 సేవలను అందుబాటులో ఉన్నాయని, శ్రీస్వామి వారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లను మరియు ఆర్జితసేవాటిక్కెట్లను పొందవచ్చునని అన్నారు.
ఇంకా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి కూడా ఈ విషయమై భక్తులలో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. దీనివలన భక్తులందరు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానంలో వసతిని పొంది సౌకర్యవంతంగా శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనాన్ని చేసుకునే వీలుకలుగుతుందన్నారు.
ఉద్యోగులందరు కూడా ఆన్‌లైన్ టికెట్ వివరాలను, చరవాణిలో స్టేటస్‌గా ఉంచాలన్నారు. దీనివలన విస్తృత ప్రచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ వివరాలను దేవస్థానంలో స్వచ్ఛందసేవలు అందించే శివసేవకులకు కూడా తెలియజెప్పాలన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ భక్తులు ఆన్‌లైన్ నందు టికెట్ బుక్ చేసుకున్నవారికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాగా భక్తులలో కల్పించేందుకు ఇప్పటికే పలుచోట్ల ఆన్‌లైన్ విధానాన్ని క్యూ.ఆర్.కోడ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని చెబుతూ మరిన్ని బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రచార మరియు ఇంజనీరింగ్ విభాగాలను ఆదేశించారు. క్షేత్ర పవిత్రతను కాపాడే చర్యలను మరింత పకడ్బందీగా చేపట్టాలని ముఖ్య భద్రతా అధికారిని ఆదేశించారు. దేవస్థానం టోల్‌గేట్ వద్ద కట్టుదిట్టంగా తనిఖీలను నిర్వహించాలని ముఖ్యభద్రతాధికారిని ఆదేశించారు. అదేవిధంగా సాధారణ రోజులలో కూడా ఆన్‌లైన్ టికెట్ల సంఖ్యను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇంకా వారు మాట్లాడుతూ దేవస్థానం అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను భక్తులు విరివిగా వినియోగించుకోవాలని, అన్నీ ఆర్జితసేవలను మరియు శ్రీస్వామివారి స్పర్శదర్శన టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా వినియోగించుకోవాలన్నారు. కాగా ఆర్జితసేవా కర్తలు మరియు స్పర్శదర్శనం టిక్కెట్ పొందిన వారు విధిగా ఆన్‌లైన్ ద్వారా పొందిన టిక్కెట్ ప్రింట్ కాపీని (హార్డ్‌కాపీని) మరియు ఆధార్‌కార్డు నకలును తమవెంట తెచ్చుకోవలసివుంటుంది. ఆ న్ లై న్ ద్వారా పొందిన ఆయా టిక్కెట్లను స్కానింగ్ జరిపిన తదుపరి మాత్రమే ఆర్జితసేవాకర్తలను మరియు స్పర్శదర్శనం టిక్కెట్లు పొందిన వారిని అనుమతించడం జరుగుతుంది. కాబట్టి భక్తులు టిక్కెట్టు / ప్రింటు కాపీని మరియు ఆధార్ కార్డ్ ప్రతిని ఒరిజినల్ ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవలసి ఉంటుందన్నారు. కా గా సామాన్య భక్తుల సర్వదర్శనానికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకుగాను అర్జితసేవలు నిర్దిష్టవేళలలో జరిపించబడుతున్నాయన్నారు. అదేవిధంగా శ్రీ స్వామివారి స్పర్శదర్శనం కూడా నిర్దిష్ట వేళల్లోనే కల్పించబడుతుంది. కాబట్టి ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందిన ఆర్జితసేవాకర్తలకు టిక్కెట్ పై సూచించిన సమయములో మాత్రమే ఆయా ఆర్జితసేవలు జరిపించబడుతాయని పేర్కొన్నారు. సేవాకర్తలు వారిసేవా సమయం కంటే కనీసం 15 నిమిషాలు ముందుగా ఆర్జితసేవా క్యూలైన్ ప్రవేశద్వారం వద్ద రిపోర్టు చేయవలసి వుంటుందన్నారు. అదేవిధంగా స్పర్శదర్శనం టిక్కెట్ పొందిన భక్తులకు కూడా టిక్కెట్టుపై పొందుపర్చబడిన సమయములో మాత్రమే స్పర్శదర్శనం కల్పించబడుతుందన్నారు. భక్తులందరు కూడా దేవస్థానం అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను వీలైనంత ఎక్కువగా వినియోగించుకోవాలని కార్యనిర్వహణాధికారి భక్తులకు సూచించారు.

# వాస్తవాలు తెలియకుండా.. వార్తలు రాయొద్దు.

**– ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ.**



( ఆలూరు మనగళం ):గుంతకల్లులో ఓ రైల్వే పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సమీప బంధువును తాను బెదిరించినట్లు ఓ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనంలో ఎలాంటి వాస్తవం లేదని ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం వీడియో సమావేశంలో మాట్లాడారు. గుంతకల్లులో రైల్వే పనుల విషయంలో గుంతకల్లు ఎమ్మెల్యే సోదరుడు నారాయణ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సమీప బంధువును తనకు కమిషన్ ఇవ్వాల్సిందేనని, లేనిపక్షంలో పనులు ఆపేసి సామాగ్రి తీసుకెళ్లి పోతామని బెదిరించి నట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అలాగే ఇదే విషయమై తాను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆయన సమీప బంధువుకు ఫోన్ చేసి తాను ఏమైనా మాట్లాడానా అని కూడా అడగడం జరిగిందన్నారు. అయితే వారి విషయంలో గుమ్మనూరు నారాయణకు ఎలాంటి సంబంధం లేదని క్లీన్ చిట్ ఇచ్చారని చెప్పారన్నారు. తాను మీడియా మిత్రులకు విజ్ఞప్తి చేయడం ఏమంటే...! వాస్తవాలు తెలియకుండా వార్తలు రాయొద్దు, తెలుసుకొని రాయాలని కోరారు. మంగళవారం ఓ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనం ద్వారా తాను తీవ్ర మనస్థాపానికి గురయ్యానని. అలాగే తన పరువు ప్రతిష్టకు తీవ్రభంగం వాటిల్లే పరిస్థితి తలెత్తిందన్నారు. రైల్వే పనులకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా అనంతపురం ఎంపీని స్వయంగా మాట్లాడి కానీ లేదా ఫోన్ ద్వారా సంప్రదించగానే క్లారిటీ తీసుకోవాలని ఆయన ఆర్ టీవి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. గుమ్మనూరు అంటేనే తన పేరును ప్రస్తావించడం సమంజసం కాదని ఆయన పదేపదే విజ్ఞప్తి చేశారు. మీడియా మిత్రులు అంటేనే నాకు చాలా గౌరవం, మీడియా చానెల్స్ కూడ నిజనిజాలు తెలుకొని వార్తలు రాయాలని మరొక్కసారి కోరారు.

# ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నాసిర్ అహ్మద్ రచించిన పుస్తకం ఆవిష్కరణ



మన గళం కోడుమూరు: అల్లూరి సీతారామరాజు అండగా నిలిచిన ముస్లిం యోధులు పజులుల్లా ఖాన్ మరియు షేక్ మదీనా గార్ల చరిత్ర ను బయటకు తీసి ప్రపంచానికి తెలియజేయడానికి కృషిచేసిన ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నాసిర్ అహ్మద్ రచించిన పుస్తకం ఆవిష్కరణ ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు ముస్తఫా అధ్యక్షతన స్థానిక సిపిఎం ఆఫీస్ నందు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథుల చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ బ్రిటిష్ వారు మన దేశానికి వ్యాపారం చేసుకుంటామని వచ్చి ముస్లిం నవాబుల చేతిలో ఉన్నటువంటి మన దేశాన్ని నవాబులపై దాడి చేసి దేశాన్ని లాక్కున్నారు ఆ కాలంలో చాలామంది మేధావులు పండితులు రచయితలు ఎంతోమంది బ్రిటిష్ వారికి ఎదురు నిలిచి పోరాటం చేశారు అందులో చాలామంది ప్రాణాలు కోల్పోయారు అప్పటినుండి స్వాతంత్రం వచ్చే దాకా ఎంతోమంది దళిత మైనారిటీ బిసి బడుగు బలహీన వర్గాల వారు కులమతాలకు అతీతంగా పోరాటం చేసి ప్రాణాలర్పించారు అలాంటివారు ఎంతోమంది చరిత్రకు దూరంగా ఉన్నారు అందులో భాగంగా ప్రజలుల్లా ఖాన్ మరియు షేక్ మదీనా లాంటి వారి ఎంతోమంది చరిత్రలను బయటకు తీసి ప్రపంచానికి తెలియజేయడానికి ఎంతోమంది రచయితలు కవులు ఉండడం మన భారతదేశం చేసుకున్నటువంటి అదృష్టం ఎందుకంటే చరిత్రకారులు వారి మరణాలకే ముగింపు కాకుండా వారి త్యాగాలను కూడా వెలికి తీసి ప్రపంచానికి తెలియజేసే వారు ఉండడం మన అదృష్టం అని వారు పేర్కొన్నారు రచయితలు కవులు మరి కొంతమంది చరిత్రను ప్రజలకు తెలియజేయడానికి కృషి చేస్తే బాగుంటుంది అని వారు తెలియజేశారు ఇందులో భాగంగా చినిగిపోయిన చొక్కా వేసుకున్న పర్వాలేదు ఒక మంచి పుస్తకం కొని చదువుకో దానివల్ల చరిత్ర తెలుస్తుంది జ్ఞానము పెరుగుతుందని మహాత్మా గాంధీ తెలియజేసిన విషయాన్ని వారు స్మరించుకున్నారు ఇలాంటి పుస్తకం రాసి ప్రజలకు అంకితం చేసిన రచయిత చరిత్రకారులు సయ్యద్ నాసీర్ అహ్మద్ కు సభ అభినందనలు తెలిపింది ఈ ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు ఇంతియాజ్ భాష ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మునుస్వామి వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ ప్రభాకర్ సిపిఎం పార్టీ నాయకులు గపూర్మియా మండల ఖాజీ హాజీ భాష తెలుగుదేశం పార్టీ నాయకులు దావూద్. జంజం మసీదు ముతవల్లి గద్వాల రఫీక్ చర్చి ప్రధాన పాస్టర్ సామ్యూల్ గారు సిఐటియు మండల అధ్యక్షులు జిపి వీరన్న తదితరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన గుమ్మనూరు నారాయణ దంపతులు.





( ఆలూరు మనగళం ): కర్నూలు పట్టణంలో గత ఆదివారం ప్యాపిలి శివ వివాహ కార్యక్రమానికి అనివార్య కారణాల వల్ల ముఖ్య అధితులుగా హాజరు కాలేక, బుధవారం ప్యాపిలి శివ ప్రత్యేక ఆహ్వానంతో వివాహ మహోత్సవ రిసెప్షన్ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా హాజరైన, ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు కమలమ్మ దంపతులు. గుమ్మునూరు నారాయణ కుటుంబ సమేతంగా కర్నూలు పట్టణంలో వారి స్వగృహానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించి, కేక్ కట్ చేసి, నవదంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణ కుటుంబ సభ్యులు, అభిమానులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్నోలో సిరీస్ సీల్..



లక్నో , డిసెంబర్ 17, మన గళం : భారత్‌సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. ఇప్పటికే రెండుఒకటి ఆధిక్యంలో ఉన్న టీమిండియా, లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనున్న నాలుగో మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను ఖరారు చేయాలని పట్టుదలగా ఉంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే భారత్ వరుసగా పద్నాలుగోసారి టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్నట్లవుతుంది. మరోవైపు సిరీస్‌లో నిలవాలంటే సౌతాఫ్రికాకు ఈ మ్యాచ్ గెలవడం తప్పనిసరి కావడంతో పోరు మరింత ఆసక్తికరంగా మారింది.ధర్మశాలలో జరిగిన మూడో టీ20లో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థిని కట్టడి చేసి జట్టుకు కీలక విజయాన్ని అందించారు. అదే ఊపును లక్నోలో కొనసాగించేందుకు టీమిండియా భారీ స్కెచ్ సిద్ధం చేసుకుంది. ఏకానా స్టేడియం పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉండటంతో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి వంటి స్పిన్ ఆయుధాలపై భారత్ భారీ ఆశలు పెట్టుకుంది. బంతి ఆగి రావడం, నెమ్మదిగా టర్న్ కావడం వల్ల బ్యాట్స్‌మన్‌లు భారీ షాట్లు ఆడడం కష్టంగా ఉండే పరిస్థితులు భారత్‌కు కలిసివచ్చేలా కనిపిస్తున్నాయి.ఈ మైదానంలో ఇప్పటివరకు భారత్ ఆడిన మూడు టీ20 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. లక్నోలో టీమిండియాకు నూటికి నూరు శాతం విజయ రికార్డు ఉండటం మరో బలమైన సెంటిమెంట్‌గా మారింది. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ చేయడం ద్వారా మ్యాచ్‌ను తనవైపు తిప్పుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సగటున నూరు యాభై నుంచి నూరు డెబ్బై పరుగుల మధ్య స్కోరు వస్తే అదే పోరుకు సరిపోతుందని భావిస్తున్నారు.టీ20ల్లో భారత్, సౌతాఫ్రికా మధ్య ఇప్పటివరకు ముప్పై నాలుగు మ్యాచ్‌లు జరగగా, భారత్ ఇరవై విజయాలు సాధించింది. సౌతాఫ్రికా పదమూడు మ్యాచ్‌ల్లో గెలవగా, ఒక మ్యాచ్ ఫలితం తేలలేదు. ఈ గణాంకాలన్నీ కూడా భారత్‌కే అనుకూలంగా ఉన్నాయి. లక్నోలో స్పిన్ జోడీ ప్రభావం, విజయ సెంటిమెంట్ కలిసివస్తే సిరీస్‌ను ఇక్కడితో ముగించేందుకు టీమిండియా పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.

# డబ్ల్యూపీఎల్ 2026 షెడ్యూల్ విడుదల..

ముంబయి ,డిసెంబర్ 17 , మనగళం : మహిళల ప్రీమియర్ లీగ్ డబ్ల్యూపీఎల్ 2026 పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. నాలుగో సీజన్‌గా జరగనున్న ఈ టోర్నీకి జనవరి 9న నవి ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా తెరలేవనుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ముంబై ఇండియన్స్, 2024 విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఓపెనర్ జరగనుంది. ఈ మ్యాచ్‌తోనే టోర్నీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.మొత్తం 28 రోజుల పాటు 22 మ్యాచ్‌లతో డబ్ల్యూపీఎల్ 2026 నిర్వహించనున్నారు. తొలి దశలో 11 మ్యాచ్‌లు నవి ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతాయి. జనవరి 10, 17 తేదీల్లో డబుల్ హెడ్డర్ మ్యాచ్‌లు మధ్యాహ్నం నిర్వహించనుండగా, మిగతా మ్యాచ్‌లు అన్నీ రాత్రి వేళల్లో జరగనున్నాయి. అనంతరం టోర్నీ వడోదరలోని కోటంబి స్టేడియానికి మారనుంది. అక్కడ మిగిలిన 11 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.ఈ సీజన్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఫైనల్ షెడ్యూల్. తొలిసారిగా ఫైనల్ మ్యాచ్‌ను వీకెండ్ కాకుండా గురువారం రోజున ఫిబ్రవరి 5న నిర్వహించనున్నారు. పురుషుల టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్‌తో సమయం తగలకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 2న ఎలిమినేటర్ మ్యాచ్ కూడా కోటంబి స్టేడియంలోనే జరగనుంది.టోర్నీ ఫార్మాట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్ జట్లు డబుల్ రౌండ్ రాబిన్ విధానంలో పరస్పరం తలపడతాయి. పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుండగా, రెండో మరియు మూడో స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్‌లో పోటీ పడతాయి.డబ్ల్యూపీఎల్ ముగిసిన పది రోజుల తర్వాత భారత మహిళల జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో టీ20లు, వన్డేలు, టెస్ట్ మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఫామ్‌పై కూడా ఈ డబ్ల్యూపీఎల్ కీలకంగా మారనుంది.

# భారత్ గెలిస్తే రికార్డులే రికార్డులు..



లక్నో డిసెంబర్ 17 , మనగళం : భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో నాలుగో పోరు లక్నో వేదికగా జరగనుంది. ప్రస్తుతం టీమిండియా రెండుఒకటి ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధిస్తే సిరీస్‌ను ఖరారు చేసుకుంటుంది. సౌతాఫ్రికా గెలిస్తే మాత్రం సిరీస్ సమం అయి చివరి మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారనుంది. ఈ కీలక పోరుకు ఇరు జట్లు బలమైన కాంబినేషన్‌తో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాయి.లక్నో పిచ్‌ను దృష్టిలో ఉంచుకుంటే టీమిండియా తన లక్కీ స్పిన్ జోడీ కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలపై మరోసారి నమ్మకం పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఇద్దరూ కలిసి ఆడినప్పుడు భారత్ అద్భుతమైన విజయ రికార్డును నమోదు చేసింది. ఈ ఏడాది వీరిద్దరూ కలిసి ఆడిన ఎనిమిది పూర్తి టీ20 మ్యాచ్‌లలో భారత్ ఏకంగా ఏడు విజయాలు సాధించింది. ప్రస్తుత సిరీస్‌లోని మూడో టీ20లో కూడా ఈ జోడీ కీలకంగా మారి భారత్‌కు గెలుపు అందించి ఆధిక్యాన్ని తీసుకొచ్చింది.లక్నో స్టేడియంలో టీమిండియా ఇప్పటివరకు మూడు టీ20 మ్యాచ్‌లు ఆడి అన్నింటిలోనూ గెలిచింది. ఇక్కడ భారత్‌కు నూటికి నూరు శాతం విజయ రికార్డు ఉంది. సౌతాఫ్రికాతో లక్నోలో ఇదే తొలి టీ20 మ్యాచ్ కావడం విశేషం. గతంలో లక్నోలో ఆడిన రెండు టీ20ల్లో కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీసి ప్రభావం చూపాడు. వరుణ్ చక్రవర్తికి మాత్రం లక్నోలో ఇదే తొలి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ కానుంది.భారత్ ఈ మ్యాచ్‌లో గెలిస్తే వరుసగా పద్నాలుగో టీ20 సిరీస్ విజయం సాధించినట్లవుతుంది. అదే సమయంలో సౌతాఫ్రికాపై ఆడిన ఇరవై తొమ్మిది టీ20 మ్యాచ్‌లలో ఇది ఆ జట్టుకు పందొమ్మిదో ఓటమిగా మారనుంది. లక్నో సెంటిమెంట్, స్పిన్ జోడీ ప్రభావం కలిసి మరోసారి టీమిండియాకు కలిసి వస్తాయా అన్నది అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.